సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం : 20 : అక్టోబర్ : 2025

న్యూస్‌రీల్

వైభవంగా రుద్రహోమం



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్: మాసశివరాత్రిని పురస్కరించుకుని పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం పూజలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో ఆదివారం అమ్మవారి సన్నిధికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరుపుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. యాగశాలలో రుద్రహోమం పూజలు జరిపారు. ముందుగా మేళతాళాలతో, వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన,గణపతి పూజ రుద్రహోమం చేశారు. చివరన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రవికుమార్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వెలుగులు నింపాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: ప్రజల జీవితాల్లో దీపావళి పండుగ కోటి కాంతులు నింపాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆకాంక్షించారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాలతో జరుపుకోవాలని సూచించారు. టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే టపాసులు ఉపయోగించకుండా హరితదీపావళి జరుపుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

నేటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో సోమవారం జరిగే గిరిజన దర్బార్‌ను రద్దు చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బిరాహుల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం దీపావళి పండుగ కావడంతో దర్బార్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. గిరిజన ప్రజలకు, ఐటడీఏ అధికారులు, సిబ్బందికి పీఓ దీపావళి శుభాకాంక్షలను తెలిపారు.

రేగులతండా వాసికి జాతీయస్థాయి ర్యాంకు



అజ్మీర చంద్ర

టేకులపల్లి: ఎయిమ్స్‌లో ఉద్యోగ నియామకాలకు జాతీయస్థాయిలో నిర్వహించిన పరీక్షలో టేకులపల్లి మండలం రేగులతండాకు చెందిన మహిళ అజ్మీర చంద్ర మూడో ర్యాంకు సాధించింది. సుజాతనగర్ మండలం సర్వారం పంచాయతీకి చెందిన అజ్మీర చందు, సాజి దంపతుల కుమార్తె చంద్ర పీజీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసింది. 2019లో టేకులపల్లి మండలం రేగులతండాకు చెందిన ఇస్లావత్ నరేందర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వివాహ అనంతరం భర్త ప్రోత్సాహంతో పీజీ డిప్లొమా పూర్తి చేసింది. నాలుగేళ్లుగా హైదరాబాద్ నిమ్స్‌లో ఈసీజీ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. ఈ ఏడాది జనవరిలో జరిగిన పరీక్షకు హాజరై ప్రతిభ చూపింది. ముంబైలోని అంధేరి ఈఎస్ఐసీ మోడల్ ఆస్పత్రిలో ఈసీజీ టెక్నీషియన్‌గా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని కైవసం చేసుకుంది.

కిన్నెరసానిలో బోటు షికారు



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం సందడి వాతావరణం కన్పించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 498 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.28,355 ఆదాయం వచ్చింది. 290 మంది బోటుషికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.17,360 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పీఎంశ్రీతో నాణ్యమైన విద్య



కొత్తగూడెంలోని బాబుక్యాంపు గర్ల్స్ హైస్కూల్‌లో వీఆర్ పరికరాలతో పాఠాలు వింటున్న విద్యార్థినులు

- పథకానికి తొలివిడతలో నాలుగు పాఠశాలల ఎంపిక
- ఏఆర్, వీఆర్ టెక్నాలజీతో అనుభవపూర్వక బోధన
- విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆసక్తి పెంచేలా కృషి

కరకగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక టెక్నాలజీతో బోధన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం అమలు చేస్తోంది. జిల్లాలో పీఎంశ్రీ పథకానికి 24 పాఠశాలలను ఎంపిక చేయగా, తొలి విడతలో కొత్తగూడెంలోని కూలీలైన్, చుంచుపల్లిలోని బాబుక్యాంపు గర్ల్స్ హైస్కూల్, పాల్వంచ జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, బూర్గంపాడులోని సారపాక ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక బోధన అందుబాటులోకి వచ్చింది. అగ్మెంటేషన్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్)ని ఉపయోగించి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విలువైన సామగ్రిని సైతం పాఠశాలలకు అందించారు.

ఆధునిక పరికరాలు పంపిణీ

పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేసిన పాఠశాలకు సుమారు రూ.10లక్షల విలువైన అధునాతన ఐసీటీ (సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ) పరికరాలతో కూడిన కిట్‌ను కేంద్ర ప్రభుత్వం అందజేస్తోంది. కిట్‌లో ప్రత్యక్ష అనుభూతి ద్వారా అభ్యసనం కోసం ఏఆర్/వీఆర్ డివైజ్‌లు, హెడ్‌సెట్‌లు, స్మార్ట్ బోర్డులు, వీడియో రికార్డింగ్ ల్యాబ్‌లు, కంప్యూటర్, ట్రాలీ, టాబ్లెట్ పీసీ తదితర డిజిటల్ లెర్నింగ్ టూల్స్ అందజేశారు. వీటితో 21శతాబ్దంలో ముఖ్యమైన నైపుణ్యాలపైన సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

అనుభవపూర్వక బోధన

పాఠశాలల్లో అనుభవపూర్వక అభ్యాసానికి పెద్దపీట వేస్తున్నారు. ఈ క్రమంలో రసాయనిక చర్యలు, భౌగోళిక అంశాలు, శరీర నిర్మాణ శాస్త్రం తదితర అంశాల బోధనతోపాటు ఏఆర్, వీఆర్ హెడ్‌సెట్ల ద్వారా ఆయా అంశాలను ప్రత్యక్షంగా వీక్షించడం, అనుభూతి చెందడం సాధ్యమవుతోంది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆధునిక టెక్నాలజీతో కూడిన బోధన అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంది. ఇక అధునాతన పరికరాల వినియోగంపై ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఇటీవల శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. నూతన బోధనా పద్ధతుల ను అందిపుచ్చుకోవడంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

అద్భుతంగా ఉంది



పుస్తకాల్లో చదివిన దృగ్విషయాలను వీఆర్ హెడ్‌సెట్ ద్వారా కళ్లముందు చూస్తున్నాం. సైన్స్ పాఠంలో హృదయ నిర్మాణం, స్పందనలు త్రీడీలో చూడటం అద్భుతంగా ఉంది. అగ్నిపర్వతాల పాఠం చెప్పినప్పుడు వీఆర్ హెడ్‌సెట్ పెట్టుకుంటే నిజంగా లావా బయటకు వస్తున్నట్టే అనిపించింది. **–తేజస్విని, 10వ తరగతి విద్యార్థిని, గర్ల్స్ హైస్కూల్, బాబుక్యాంపు**

సృజనాత్మకత పెరుగుతుంది



పీఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికత ప్రవేశపెట్టింది. విద్యార్థులు చూసి నేర్చుకోవడం, అనుభవంతో అర్థం చేసుకోవడం'అనే కొత్త పద్ధతిలో బోధన సాగుతుంది. ఏఆర్, వీఆర్ పరికరాల ద్వారా బోధన పిల్లల్లో ఆసక్తి, సృజనాత్మకత పెంచుతుంది. **–నాగరాజశేఖర్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్**

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

22 నుంచి శివాలయంలో కార్తీక పూజలు



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరినస్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు.

కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు

కార్తీకమాసం సందర్భంగా శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ దామోదర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సోమవారం 27న భస్మాభిషేకం, నదీహారతులు, నవంబర్ 3న చందనోత్సవం, 5న కార్తీకపౌర్ణమి సందర్భంగా ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు రుద్రాభిషేకం, సాయంత్రం నదీహారతులు, జ్వాలతోరణం జరుపుతామని పేర్కొన్నారు. 9న స్వామి వారి కల్యాణ మహోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం, 10న పుష్పోత్సవం, 17న ఏకా దశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, 16న గోదావరి నదీతీరంలో నదీ హారతులు ఉంటాయని వెల్లడించారు. ప్రతీ సోమవారం సాయంత్రం జ్యోతిర్లింగార్చన, ఆకాశదీపోత్సవం, నీరాజన మంత్రపుష్పం, రోజూ సాయంత్రం 6 గంటల నుంచి సామవేద పండితులు డీఎస్ఎస్ సన్యాసి శర్మ కార్తీక పురాణ ప్రవచనాలు చేస్తారని వివరించారు.

స్వామివారికి విరాళాలు

హనుమకొండకు చెందిన సముద్రాల రామనరసింహాచార్యులు, సుజాత దేవిదంపతులు రామదాసు పీఠం మూలనిధికి రూ.1,00,101, సికింద్రాబాద్‌కు చెందిన కడియాల సత్యనారాయణ, కమల దంపతులు రూ. లక్ష శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి విరాళంగా అందించారు. దాతలకు ఆలయ ఏఈవో శ్రవణ్‌కుమార్ రశీదులు అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబు, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ అధ్యక్షుడిగా లక్కినేని



లక్కినేని సత్యనారాయణ

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్ర న్యాయవాదల ఫెడరేషన్ అధ్యక్షుడిగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ బాధ్యులు ఎర్రపాటి కృష్ణ, సాదిక్ పాషా, అక్కినేని వెంకటదుర్గారావు, యెర్రా కామేష్, చిన్ని కృష్ణ, మారపాక రమేష్ అంబటి రమేష్, సామంత్, వడ్లకొండ హరిప్రసాత్, జె గోపి కృష్ణ తదితరులు అభినందనలు లక్కినేనికి అభినందనలు తెలిపారు.

'మద్యం' దరఖాస్తుల గడువు పెంపు



కొత్తగూడెం అర్బన్: ఈ నెల 23వ తేదీ వరకు జిల్లాలో కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ జానయ్య ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపా రు. శనివారం బంద్ జరిగిన నేపథ్యంలో డీడీలు తీయలేకపోయామని పలువురు విజ్ఞప్తి చేయగా, గడువు పెంచినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో 27న మద్యం షాపుల డ్రా తీస్తామని తెలిపారు. గత నెల 26వ తేదీ నుంచి ఈ నెల 18వ తేదీ వరకు జిల్లాలోని 88 మద్యం దుకాణాలకు 3,799 దరఖాస్తులు వచ్చాయని, తద్వారా ప్రభుత్వానికి రూ. 113.97 కోట్ల ఆదాయం సమకూరిందని వివరించారు. గడువు పెరిగిన నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

'ఆయిల్‌ఫెడ్' జీఓ ప్రతులు దహనం



జీఓ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

దమ్మపేట: తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఇటీవల విడుదల చేసిన జీఓ ప్రతులను తెలంగాణ రైతు సంఘం(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో ఆదివారం దహనం చేశా రు. ఆయిల్‌ఫెడ్‌కు సంబంధించిన పామాయిల్ ఫ్యాక్టరీలు, నర్సరీల్లోకి ఉన్నతాధికారుల అనుమతి లేకుండా రైతులు, మీడియా, ఇతరులు ప్రవేశించేందుకు వీలులేదంటూ జీఓ జారీ చేశారు. ఆ జీఓను వ్యతిరేకిస్తూ దమ్మపేటలో ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు అన్నవరపు సత్యనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్యలు మాట్లాడుతూ ఆయిల్‌ఫెడ్ జారీ చేసిన జీఓ బ్రిటీష్ కాలం నాటి నిర్బంధ చట్టాలను గుర్తుకు తెస్తోందని అన్నారు. పామాయిల్ నర్సరీలో నాణ్యతలేని నకిలీ మొక్కలను పెంచి రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఫ్యాక్టరీల్లో జరిగే అవినీతి, కుంభకోణాలు బయటకు రాకుండా ఉండేందుకే ఇలాంటి జీఓ ఇచ్చారని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాధ్యత వహించి జీఓ ఉపసంహరించుకోవాలని కోరారు. పామాయిల్ అత్యధికంగా పండుతున్న అశ్వారావుపేట నియోజకవర్గంలోనే రిఫైనరీ ఫ్యాక్టరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డా లక్ష్మీనారాయణ, మొరంపూడి శ్రీనివాసరావు, రావుల శోభన్‌బాబు, కొలికపోగు శ్రీనివాసరావు, యండ్రాతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తులు.. పై ఎత్తులు

హోరాహోరీగా రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మం టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ నిర్వహించారు. అండర్ – 8, 10, 12, 14 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించగా వివిధ జిల్లాల క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-8 బాలుర విభాగంలో లావుడ్యా చౌహాన్, కార్తికేయ, దర్శన్ రెడ్డి, ఈశ్వర్, హర్ష, అండర్-10లో శివనాగసాయి, అరిహంత్, గౌతమ్‌కృష్ణ, నిఖిల్‌చంద్ర, విశ్వతేజ, అండర్-12లో ఎస్.గౌతమ్ చంద్రమోళిత్, రామ్ నిఖిత్, భూక్యా తనీష్, ఆర్యన్‌శర్మ వరుసగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచారు. అలాగే, బాలికల అండర్-8 విభాగంలో సహస్ర, సామికా, తేజశ్రీ, జిహిత, జితిషా, అండర్-10లో అంధ్య, అనికారామ్, కార్తీక్ ప్రణవ్, అద్విక గౌరీ, శరణ్యప్రియ, అండర్-12లో భవజ్ఞ, రీతూశ్రీ, కృతధార, నిహారిక, దిలీషా, అండర్-14 బాలికల విభాగంలో లక్ష్మి, హర్షిత, శ్రీసాత్విక, సిరిలయ, ఆరాధ్య మొదటి ఐదు స్థానాల్లో నిలవగా నిర్వాహకులు బహుమతులు అందజేశారు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రఫీ, ఆర్గనైజర్ టి.వీరన్నతో పాటు శివకృష్ణ, కావ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

వెలుగుల పండుగకు వేళాయె..

వెలుగుల పండుగ దీపావళి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో ఆదివారం బాణసంచా, ప్రమిదల విక్రయాలు జోరుగా సాగాయి. కాగా, పాల్వంచ, ఇల్లెందులలో వర్షం రావడంతో టపాసుల వ్యాపారులు నిరాశ చెందారు.



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలోని బాణసంచా దుకాణాల వద్ద సందడి

- వివరాలు 9లో..

అర్ధరాత్రి ఏసీబీ సోదాలు

- అంతర్రాష్ట్ర ఆర్టీఏ చెక్ పోస్టుల్లో తనిఖీలు
- లెక్కకు మించి ఉన్న నగదు స్వాధీనం
- రికార్డులను వెంట తీసుకెళ్లిన అధికారులు



పాల్వంచ రూరల్: ఆర్టీఏ చెక్ పోస్టులో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

పాల్వంచరూరల్/అశ్వారావుపేట/పెనుబల్లి: అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు ఉమ్మడి జిల్లాలోని అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో సోదాలు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఆర్టీఏ చెక్ పోస్టుల్లో తనిఖీలు చేపట్టారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలోని సోదాలు జరిపారు. పాల్వంచ మండలం జగన్నాథపురం, నాగారం కాలనీ గ్రామాల మధ్య బీసీఎం జాతీయ రహదారిపై ఉన్న చెక్‌పోస్టులో దాడులు నిర్వహించారు. కంప్యూటర్ డేటా, రికార్డులతోపాటు చెక్‌పోస్టులోఉన్న అధికారి, సిబ్బంది సెల్‌ఫోన్లను కూడా తనిఖీ చేశారు. ఓవర్‌లోడ్ ఫైన్, ట్యాక్స్ కలెక్షన్ వంటి విషయాల్లో డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలపై తనిఖీలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. లెక్కలో లేని రూ.26 వేల నగదు లభించిందని పేర్కొన్నారు. దొరికిన నగదు వ్యవహారంపై ఎంవీఐ, సిబ్బందిపై చర్యలకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు సమాచారం. కాగా ఇదే చెక్ పోస్టులో గతేడాది ఆగస్టులో కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. అశ్వారావుపేట ఆర్టీఏ చెక్‌పోస్టులో కూడా ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల పరిధిలోని ముత్తగూడెం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. సీజ్ చేసి తమ వెంట తీసుకెళ్లారు. రికార్డుల ప్రకారం ఉండాల్సిన సొమ్ము కంటే అదనంగా రూ.6,660 ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు పాటించాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు



ఓసీలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): ఓబీ డంప్‌లలో హాలేజీ రోడ్లపై రక్షణ సూత్రాలను పాటిస్తూ పనులు చేయాలని, సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సింగరేణి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కొత్తగూడెం ఏరియాలోని వీకే-7 ఓసీని సందర్శించారు. వ్యూ పాయింట్ నుంచి ఓసీలో చేపడుతున్న మట్టి తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టి తొలగింపు పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనుకున్న సమయానికి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం ఎం.శాలేంరాజు, అధికారులు శ్రీరమేష్, రామచంద్ర మురళి, కిశోర్ పాల్గొన్నారు.

టపాసుల షాపుల వద్ద ఫైరింజనేది?



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రక్షణ చర్యలు పాటించకుండా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

నిబంధనలు పాటించని వ్యాపారులు

కొత్తగూడెంటౌన్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద వ్యాపారులు నిబంధనలు పాటించడంలేదు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో 40 , రామవరంలో 6, రుద్రంపూర్‌లో 2 షాపులకు అధికారులు అనుమతులు ఇచ్చారు. ప్రకాశం స్టేడియంలో 40 షాపులు ఏర్పాటు చేసినా అగ్నిమాపక ఫైరింజిన్ అందుబాటులో ఉంచలేదు. దుకాణాల ముందు డ్రమ్ములు ఏర్పాటు చేసినా వాటిలో నీళ్లు కూడా నింపలేదు. మున్సిపల్ ట్యాంకర్ మాత్రం ఒకటి అందుబాటులో ఉంచారు. మట్టి బకెట్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. షాపుల ఏర్పాటు, రక్షణ చర్యలను అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కమీషన్‌లు ఇచ్చి అనుమతులు తెచ్చుకున్నామని, నిబంధనలు పాటించకపోయినా అధికారులు ప్రశ్నించరనే ధీమాతో వ్యాపారులు ఉన్నట్లు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. యజమానులు టపాసుల అమ్మకాలపై ఉంచిన శ్రద్ధను, అవి కొనేందుకు వచ్చే ప్రజలకు హాని జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చూపడం లేదని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి షాపుల వద్ద ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలని, నిబంధనలను పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగే సీపీఐ జాతీయ శతాబ్ది ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.సారయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి 40 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఐదు లక్షల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సు జాతా ఏర్పాటు చేశామని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో ప్రజలను విడదీస్తూ, రాజకీయ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలో మావోయిస్టు పార్టీ లేకుండా చేస్తామని ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం నరహత్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమై పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా మాట్లాడుతూ శత వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, మిర్యాల రంగయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, నరాటి ప్రసాద్, వై.ఉదయ్ భాస్కర్, ఎస్‌డి.సలీం, సలిగంటి శ్రీనివాస్, రావులపల్లి రవికుమార్, చంద్ర నరేంద్రకుమార్, వీరస్వామి, వెంకటేశ్వరరావు, ఎల్లయ్య, శంకర్, మురళి, సమలయ్య, దస్రు, నాగయ్య, రాహుల్, ఫహీం తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు అండగా ఉంటాం..

పినపాక: పోడు రైతులకు అండగా ఉండి, వారి పక్షాన పోరాటాలు చేయడానికి సిద్ధమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని ముద్దులగూడెంలో గిరిజనుల వ్యవసాయ పొలాలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజనులకు పోడు పట్టాలు మంజూరు చేయాలని, ఫారెస్ట్ అధికారుల దాడులను నియంత్రించాలని డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు రమేష్, దుబ్బ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.











ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



అండర్-17 బాలుర జట్టుతో కోచ్‌లు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ఈ ఎంపిక పోటీలు జరిగాయి. పోటీలకు 40 మంది బాలలు, 30 మంది బాలికలు హాజరయ్యారు. ఎంపికల ప్రక్రియను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వై.రామారావు, బాస్కెట్‌బాల్ కోచ్‌లు పీ.వీ.రమణ, కృష్ణమూర్తి, రామారావు, భరత్‌చంద్ర పర్యవేక్షించారు.

జట్లు ఇవే...

అండర్-17 బాలుర బాస్కెట్‌బాల్ జట్టుకు అక్కి ఆయాన్, కె.స్నేహిత్, యశ్వంత్, హర్షవర్ధన్, సాత్విక్, సుమంత్, జెస్సు కిరణ్, చరణ్, సూర్య, గౌతమ్ సాహూ, ఎం.సాకేత్, రేహాన్, రైసింగ్, ఎస్.సాకేత్, అభినవ్, విశ్వతేజ, చత్రపతి శివాజీ, ఎండీ.గౌస్ అస్లాం ఎంపియ్యారు. అలాగే, బాలికల జట్టులో పి.అఖిల, రిశివశ్రీ, పూనం హన్సీ, సహస్ర, ఓంకారుణ్య, ఆయుషాన్వి, కీర్తి స్వప్నిక, తమన్ వి.తమరిత, చందనశ్రీ, దీక్షిత, యక్షిత, సాత్విక, ధతి, మనస్విని, కీర్తన, బి.హారిణి, కె.రితికాశాస్త్ర, కె.గ్రేస్‌కు స్థానం దక్కింది.

అండర్-19 బ్యాడ్మింటన్, కరాటే జట్లు..



జిల్లా బాలబాలికల కరాటే జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్, కరాటే జట్ల ఎంపిక పోటీలు ఆదివారం ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించారు. ఎంపిక పోటీలను కోచ్‌లు జి.రాము, గోపతి సైదులు ఎస్.కే.ఖాసీం, ఎం.బాబు, ఎండీ. మహబూబ్, ఎం.సురేష్, హరీష్, ఎం.సందేష్ పర్యవేక్షించగా జట్ల వివరాలను అండర్-19 క్రీడల కార్యదర్శి ఎం.డీ.మూసా కలీం ప్రకటించారు. అండర్-19 బ్యాడ్మింటన్ బాలుర జట్టుకు ఎన్.నవీన్ ఉదయ్, ఎం.రాజీవ్, డి.నవీన్, ఎ.అరవింద్, జి.నవదీప్, బాలికల జట్టులో బి.ధరణి ప్రియ, ఎ.రష్మీ, కె.హెమీమా, ఎస్.గాయత్రి, జి.మహాలక్ష్మి స్థానం దక్కించుకున్నారు. అలాగే, కరాటే జట్టులో వివిధ కేటగిరీలకు గాను కె.అరుణతేజ్, డి.గౌరీశంకర్, కె.హర్షతేజ, కె.గణేష్, షాహిద్, ఎం.డీ. అసదుద్దీన్, ఎస్.కే.రియాన్, ఎం.లాస్యశ్రీ, వి.లక్ష్మీశ్రావణి, బి.సహస్రసేన్, ఎం.డీ.హాఫషాజబీన్, కె.నిఖిత ఎంపికయ్యారు.

జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలి

ములకలపల్లి: మల్టీపర్పస్ విధానంలో చాలాఏళ్లుగా పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ములకలపల్లి మహాసభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. తొలుత సీనియర్ నాయకుడు చిక్కుల శ్రీను సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. జీపీ కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని సంఘ జిల్లా కార్యదర్శి ఏ.జే. రమేశ్ అన్నారు. సంఘ జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల అర్జున్, కన్వీనర్లు నిమ్మల మధు, రఘు, యాదగిరి, వెంకటప్పయ్య, చిక్కుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.











బీసీ రిజర్వేషన్లపై తప్పుడు రాజకీయాలు



సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

కరకగూడెం: బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం కుర్నవల్లిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలనలో ప్రజల కష్టాలు రోజు రోజుకు పెరుగుతున్నాయే కాని పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పసలేని కేసులు పెడుతూ కాంగ్రెస్ పార్టీ పబ్బం గడుపుతోందని, కేవలం మాజీ సీఎం కేసీఆర్‌ను బదనాం చేయడానికే పాలన కొనసాగిస్తున్నట్లుగా ఉందని విమర్శించారు. ఓ వైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సీబీఐ సంస్థలను మోదీ జేబు సంస్థలని విమర్శిస్తుంటే, మరోవైపు రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరడం ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలను తేటతెల్లం చేస్తుందన్నారు. కాగా, రానున్న రోజులన్నీ తమవేనని, పార్టీ కార్యకర్తలందరూ గ్రామాల్లో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి అక్కడే డిజిటల్ క్యాంపెయిన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, నాయకులు అక్కిరెడ్డి వెంకటరెడ్డి, బైరిశెట్టి చిరంజీవి, రేగా సత్యనారాయణ, లక్క మధు, కొమరం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

















